


**వంటింట్లో పనిచేస్తూ మధ్య మధ్యలో మెయిన్ హాలులో, రెండేళ్ళ వయస్సుగల తన కొడుకు ఏం చేస్తున్నాడో అని తొంగి చూస్తోంది రాధ.**

అయితే బుజ్జిగాడు బుద్ధిగాసోఫాలోకూర్చుని టి.వి.లో చిన్నపిల్లల కార్టూన్లు చూస్తూ హుషారుగా కేకలు పెడ్తూ గట్టిగా చప్పట్లు కొడ్తున్నాడు.

రాధ నెమ్మదిగా వంట పనంతా ముగించింది. ఇంకపోతే కిచెన్ సింక్‌లో వున్న కాఫీ కప్పులు, సాసర్లు వగైరా సామాగ్రిని కడిగిపెట్టడం మిగిలిన పని. 'ఎంత పని! ముగించెయ్యగలనులే!' అని ధీమాగా తలాడించి, మరోసారి ఆ హాలులోకి బుజ్జిగాడి దృష్టి ఎటుమళ్ళిందో తెల్సుకోడానికి తొంగి చూసింది. అంతే, అక్కడి దృశ్యాన్ని చూసి ఆపుకోనంత కోపం వచ్చింది. ఒక్క క్షణం పాటు తనేం చేస్తున్నదో తనే తెల్సుకోలేనట్టు ఫీలవ్వ సాగింది. మనస్సంతా అక్కడే చితికి చిన్న చిన్న ముక్కలైన చైనా పోర్సిలైను వాజ్ మీద నిలిచిపోయింది.

అది సూజన్ అని తన స్నేహితురాలు ఎంతో అభిమానంతో తన పుట్టినరోజునాడు బహూకరించింది. చిన్నప్పటి నుండి రాధకి ఫ్లవర్ వాజ్ లంటే ఒక ప్రత్యేకమైన ఇష్టం. రకరకాల వాజ్‌లను సేకరించడం ఆమె హాబీ కూడా. సూజన్ ఆ బహుమతినిచ్చి ఒక్క ఏడాది పైనే అయ్యింది. ఇంత కాలం ఆ వాజ్‌ని పెట్లో భద్రంగా దాస్తూ వచ్చింది. ప్రతిసారి వాళ్ళింటికొచ్చినపుడు సూజన్ అడుగుతూనే వుంటుంది- "నే నిచ్చిన వాజ్‌ని బైటకి తీసి డ్రాయింగ్ రూమ్‌లో పెట్టవోయ్" అని.

ఆఖరికి ఎలాగైతేనేమి, ఒక పదిహేను రోజుల క్రితం పైకి తీసి, టి.వి. వున్న హాల్లో ఒకపక్క బల్లపైన అలంకరించింది. ఆ అందమైన వాజ్‌కి అప్పుడే ఆయుర్దాయం తీరిపోయింది. ఈ విషయం తెలిస్తే సూజాన్ తనని అభిమానంతో ఇచ్చిన వస్తువుల విలువకాని, ఇచ్చిన వారి ప్రేమ కాని తెలియని ఒక మొద్దుజాతి మనిషని అనుకోవచ్చని రాధ (అనవసరంగా) మరింత వ్యధకి గురికాసాగింది.

అసలు ఏ క్షణాన దాన్ని ఆ సైడ్ టేబిల్‌పై పెట్టిందో కాని, ప్రతి రోజూ బుజ్జిగాడి దృష్టి దానిమీదనే. అదంటే వాడి కెందుకంత ఇష్టమో తెల్సుకోలేకపోయింది. అంతేకాదు దాన్ని వాడికందని ప్రదేశంలో పెట్టడానికి కూడా ప్రయత్నం చేయలేదు. ఎన్నెన్ని ఆట బొమ్మలున్నా వాడు పెంకిగా ఆ వాజ్‌పై చూపించే మోజుకి అర్థం ఏమిటోనని భర్తతో వాడిమీద ఫిర్యాదు చేసింది. ఒక పెద్ద బిజీ ఆఫీసరయిన రాధ భర్త- "ఆమాత్రం గ్రహించలేవా? పసివాళ్ళు మనం వద్దన్న పని చేసి పొందే ఆనందం వర్ణించలేనిది. నీ వాజ్ మీద నీకు వాడికన్నా ఎక్కువ మోజైతే దాన్ని వాడికి కనపడకుండా అలమరాలో పెట్టు" అని అతి తేలిగ్గా ఉపాయం చెప్పి, ఆఫీస్‌కి వెళ్ళిపోయాడు. ఇంత జరిగినా, రాధ ఆ వాజ్‌ని వాడికి అందే చోట కన్పడేటట్టే వుంచింది. ప్రతి రోజు "బుజ్జీ దీన్ని తాకకు" అని పదేపదే చెప్పి 'డోంట్ టచ్ దిస్' అంటూ డిసిప్లిన్ పెట్టింది. బుజ్జిగాడు బదులుగా అమ్మెదురుగుండా ముద్దుముద్దుగా 'దోత్తచ్ దిస్' అంటూ వల్లిస్తూ సోఫాలోకి ఎక్కి కూర్చుంటూ వచ్చాడు. చిన్నపిల్లలు పెద్దవాళ్ళ మాటలనులనుసరిస్తారేకాని వాటి అర్థం నూరుపాళ్ళు గ్రహిస్తారని ఆశించడం, ఆశపెట్టుకోవడం వెర్రితనమేనని రాధ ఏనాడూ అనుకో లేదు. అంతేకాదు రెండేళ్ళ పసివాడు మాటలాడిన మాటలన్నీ నిలబెట్టుకోగలడని ఏదో ఊహించుకొంది. వీటన్నిటికంటూ ముఖ్యమైన విషయం - ఆ రోజు కార్టూనులో మిక్కీ మౌస్ ఒక వాజ్‌ని చితక్కొట్టడం చూసి బుజ్జిగాడు ఇన్నాళ్ళూ తన మనస్సులో అణచుకొంటూ వస్తున్న ఎక్సైట్‌మెంట్‌ని కంట్రోల్ చేసుకోలేక ఆ చైనా వాజ్‌ని చితక్కొట్టి పడేశాడు.

"ఎన్నిసార్లు చెప్పేను, నీకీవాజ్‌ని ముట్టుకోవద్దని?" గట్టిగా అరిచి, వాడి నడ్డిమీద ఢన్‌ఢన్ మని మూడు దెబ్బలు బాదింది. దెబ్బలు చెళ్ళుమనిపడడంతో బెంబేలుపడి బిగ్గరగా, మరింత బిగ్గరగా "డాడీ!" అంటూ కేకలు పెట్టి ఏడవసాగాడు. బుజ్జిగాడి కుటుంబం వాళ్ళ చుట్టాలందరికీ బహుదూరంలో వున్న కారణాన ఆ ఇంట్లో వాడు, వాళ్ళ అమ్మ, నాన్న తప్ప మరెవ్వరూ లేరు. వాళ్ళు నివసించే ఆ గొప్ప కాలనీలోని ఇళ్ళవారంతా ఎవరికి వారే యమునా తీరే అన్నట్టు ఒకరితో మరొకరు పూసుకొనే రకం కాదు. బుజ్జిగాడికి వాళ్ళ అమ్మ కొట్టినా, తిట్టినా, నాన్న ఆఫీసునుండి తిరిగి వచ్చే వరకూ అమ్మే శరణ్యం. 'రోజులో ఒక్కసారి కూడా నన్ను ముట్టుకోనివ్వని ఆ వాజ్ అమ్మకీ నాకూ మధ్య ఎందు న్న అసూయతో వాడీపని చేసినా సబబే. మిక్కీ మౌస్ కూడా వాణ్ణి రెచ్చకొట్టింది

ఆ క్షణంలో ఇవన్నీ ఆలోచించే ఇంగిత జ్ఞానం కోల్పోయిన రాధ, వాడు తను వేసిన దెబ్బలకి చిచ్చుపెట్టి ఏడుస్తూంటే మరింత రెచ్చిపోయి, "అన్నా! ఉండు నీ పని చెపుతా! ఏడుపు ఆపుతావా లేదా? ఆపకపోతే చూడు ఏం చేస్తానో" అని అరవసాగింది. బుజ్జిగాడూ కోపంతో రెచ్చిపోతున్న వాళ్ళమ్మని ఆ రూపంలో ఎప్పుడూ చూడలేదు. అంతే! ఈసారి నిజంగానే భయపడిపోయాడు. ఏడుపు నింకా తారస్థాయికి పెంచేశాడు. "ఆపరా! నీ కోర్కె తీరాపగలగొట్టావుగా నా చైనా వాజ్‌ని! ఇంకా నా మొహాని కెందుకీ ఖరీదైన క్రిస్టల్ ఫ్లవర్ వాజ్" అంటూ, టి.వి.పై అందంగా పెట్టిన, తన భర్త తమ మొదటి వెడ్డింగ్ ఏనివర్సరీ సందర్భంగా కొన్న అతి విలువైన ఆ వాజ్‌ని నేలమీదకి జోరుగావిసిరేసింది.

అంతే! ముక్కలు చెక్కలయిన ఆ వాజ్‌ని చూసి, బుజ్జిగాడు 'మమ్మీ' అంటూ రాధని గట్టిగా పట్టేసుకొని గోలపెడ్తూంటే క్షణంలో తను కోల్పోయిన విచక్షణా జ్ఞానం తొంగిచూసిందామెలో. సిగ్గుతో, బాధతో, కళ్ళనిండా నీళ్ళతో "బుజ్జీ! నన్ను క్షమించరా! ఎంత పొరపాటు చేసాను" అని వాణ్ణి ఎత్తుకొని తల నిమురుతూ మంచినీళ్ళిచ్చింది. బుజ్జిగాడు నీళ్ళు తాగుతూ అన్నీ మర్చిపోయి నోటి నిండా నీళ్ళు నింపి పుర్ మంటూ రాధ మొహంమీదకి చిమ్మసాగేడు. "అమ్మా! తెలియక చేసిన నా తప్పుకి నన్ను శిక్షించి, అన్నీ తెల్సి నువ్వే పెద్ద తప్పు చేసేవు. ఇలాంటి విషయాలు పట్టించుకోని నాన్న దృష్టిలో వాజ్‌లకన్నా మనుష్యులే ముఖ్యం అనిమనిద్దరికీ తెల్సు, అలాంటపుడు నిన్నెవరు కొట్టగలరమ్మా?" అన్నట్టు చూస్తూన్న బుజ్జిగాడి కళ్ళలోకి సూటిగా చూడలేక వాణ్ణి ముద్దుల వర్షంలో తడిపేస్తూ తన అంతరాత్మ ముందు ఇంకెప్పుడూ కోపం తెచ్చుకోనని ఒట్టుపెట్టుకొంది ఆ కోపిష్టి రాధమ్మ.

●